# హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక

## రెండవ పాఠము

## వినుటకు మందులు

**పాఠ్యోద్దేశము:** ఈ పత్రికను పొందిన హెబ్రీ క్రైస్తవుల మధ్య ఏమి జరుగుచున్నదో, దానికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారమును సేకరించుట ద్వారా, పత్రిక ఎందుకు వ్రాయబడిందో నిర్ధారించుట.

జ్యేష్ఠుల సంఘ సభ్యులకు హెబ్రీ పత్రిక వ్రాయబడెను (హెబ్రీ 12:22-24), ఆ సమాచారముతో ఈ పత్రికను ఆసక్తితో పఠించి మంచి వ్యాఖ్యానికులుగాఉండెదము. ఒకసారి కంటె ఎక్కువసార్లు పత్రికనంతటిని పఠించుటయే మనము సాధించవలసిన నియమిత కార్యము. ఈ పత్రికను పొందిన వారి మధ్య ఏమి జరుగుచున్నదో వాటికి సంబంధించిన **నిర్దిష్టమైన ఋజువుల** కొరకు సూక్ష్మముగా మనము పరిశీలించి, వాటిని పుస్తకమునందు వ్రాయుటకు ఆరంభించవలెను.

"రచయిత ఈ పత్రికను ఎందుకు వ్రాసెను?" అను ప్రధాన ప్రశ్నకు సమాధానమును మనము కనుగొనవలెను. ఒకటి కంటే ఎక్కువ కారణములు ఉండవచ్చును గాని, సాధారణముగా ఒకే ఒక ముఖ్యఉద్దేశ్యము పత్రిక వ్రాయుటలో ఉండి ఉంటుంది. ఒకవేళ సమస్య ఉంటే, మనము దానిని నొక్కి చెప్పలేకపోతే, అయ్యో! మనకు ఒక సమస్య ఉన్నట్లే. దేవుని దైవిక పరిష్కారమును మనము కనుగొనలేము.

క్రొత్త నిబంధన పత్రికలను పొందిన గ్రహీతల సమస్యలకు, దైవిక పరిష్కారమును మనము తప్పక తెలుసుకొనవలెను. అప్పుడు ఆ ఉపదేశములను, సూత్రములను లేక ఆజ్ఞలను ఉపయోగించి మన మధ్యనున్న సమస్యలను మనము పరిష్కరించుకొన గలము. సంఘమునకు వాక్యమును అనుగ్రహించుటకు దేవుడు ఈ పద్ధతిని ఎన్నుకొనెను. దీనినే "పనిచేయు వేదాంతం" అందురు. ప్రతి పత్రిక సాధించవలసిన పని ఒకటుంటుంది. హెబ్రీ పత్రికను చదువుటకు ముందు, ఆ పత్రిక వ్రాయబడిన ఆత్మీయ స్థాయిలో, పత్రిక సాధించవలసిన పనిని గూర్చి మనము కొంత అవగాహన కలిగియుండవలయును.

ఈ పత్రిక యొక్క రచయిత ఎవరో గుర్తించబడలేదు. అందువలన పత్రికలోనున్న విషయములను గ్రహించుటకు ఆ వాస్తవముతో నిమిత్తం లేదు. అయినప్పటికిని, ప్రత్యేకముగా ఈ పత్రిక వ్రాయు సమయానికి గ్రహీతల పరిస్థితిని గూర్చి మంచి అవగాహన కలిగిఉండటము చాలా ముఖ్యము.

ఈ సన్నాహక చర్యలో మనము ఒక సమస్యను కనుగొన్నట్లు ఊహిస్తే, రెండు పట్టికలను మనము తయారు చేసుకొందము. మొదటి పట్టికకు 'నిర్దిష్టమైన సమస్యలు" లేక "ఖచ్చితమైన సమస్యలు" అని మరియు మరొక పట్టికకు "సూచన ప్రాయమైన సమస్యలు" లేక "ఊహించిన సమస్యలు" అని పేరు పెట్టుదము. నిర్దిష్టమైన సమస్యలను రచయిత ప్రత్యేకముగా చెప్పును. ఒక రచయితే ఈ రెండు పట్టికలకు సమాచారము అందించవలయునని గుర్తించుము. ఈ సమాచారమును కనుగొనుటయే మన పని గనుక, ఈ పత్రికంతటిని **పూర్తిగా** ఒకేసారి చదువవలయును. పత్రికలను ఉత్తరములుగా భావింతుము. సగం ఉత్తరము లేదు, ఉండదు. పత్రికనంతటిని ఒక్క విభాగముగా తెలుసుకొనగలుగు వరకు మనము ఈ పత్రిక అంతటిని చదవాలి, మరియు అవసరం అనుకొంటే వ్రాసుకోవాలి. పరధ్యానముగా చదవకుండా పత్రిక నంతటిని ధ్యానించగలగాలి. ప్రారంభముతో పాటు పత్రిక యొక్క ముగింపును కూడా మనము చూడగలుగునట్లు, రచయిత కలిగియున్న 'సమస్యపరిష్కార ప్రణాళిక' యందు గల భావావేశమును, మనము అర్ధముచేసు కొనవలెను.

మొదట మనము మన ఖచ్చితమైన పట్టికను తయారు చేయుదము. కొన్నిసార్లు ఇది కష్టమైన పనిగా నుండును. అయినప్పటికిని, హెబ్రీ పత్రిక విషయములో మాత్రము సులువే. ఎందుకంటే, రచయిత వారి సమస్యలను గూర్చి చాలా విషయము లను తరచుగా, స్వేచ్ఛగా మాటలాడెను. ఉదాహరణకు: దయచేసి హెబ్రీ 5:11-6:12ను చదువుము. "మీరు వినుటకు మందులైనందున" యని రచయిత చెప్పెను. ఇది ఊహించి చెప్పిన మాటకాదు. ఖచ్చితమైన మాట, స్పష్టముగా చెప్పబడినది. వారు వినుటకు మందులై యున్నారని రచయిత నమ్ముచున్నాడు. గ్రహీతలను గూర్చి రచయిత యొక్క గ్రహింపే మనము కలిగియున్న సమాచారమునకు మూలము. రచయిత గ్రహీతలను ఎలాగు చూచెనో, మనము అలాగే వారిని చూచుటకు నేర్చుకొన వలెను. ఈ పత్రికను రచించుటకు పరిశుద్ధాత్మ రచయితను ప్రేరేపించెనని మనము నమ్మిన యెడల, మనము కూడ స్వేచ్ఛగానే ఈ పనిని చేయుదము.

మొదట వారు ఎలాగుండేవారు? వారికి ఏమి బోధింపబడిందో అను స్థాయిని బట్టి ఏర్పడిన సమస్యలలో ఒక సమస్యను ఇప్పుడు వారు కలిగి ఉండవచ్చునని గ్రహించాలి. గతములో వారు బాగా బోధింపబడిన వారు. హెబ్రీ. 2:3; 3:14 మరియు 4:2ను చూడుము. వారు వాటిని గ్రహించిన వారే. వారు వెలిగింపబడిన వారే హెబ్రీ 10:32. మానవ జాతికి అనుగ్రహింపబడిన ఉన్నతమైన మహిమ గల ఆత్మీయ నిరీక్షణ వారికి బోధింపబడెను. గాని ఈ పత్రిక వ్రాయబడిన సమయానికి వారు దానిని మరచిరి. "**కుమారులతో** సంభాషించునట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరచితిరి" అని రచయిత హెబ్రీ 12:5లో చెప్పెను. "దేవుడు వారిని ఎందుకు సృజించెనో మరియు యేసు ఎవరిని మహిమకు తెచ్చుచుండెనో" అను విషయములను కూడ వారు మరచిరని మీరు ఊహించగలరా (హెబ్రీ 2:10)?

మెల్కీసెదెకు యాజకత్వమును గూర్చి "చెప్పవలసిన అనేక సంగతులున్నవి" గాని, తాను ఈ పత్రిక వ్రాయు సమయమునకు హెబ్రీ క్రైస్తవులు, ఈ అంశమును గూర్చి ఆలోచించే స్థితిలో లేరని రచయిత చెప్పెను (హెబ్రీ 5:11). క్రీస్తు యాజకత్వము పట్ల వారు తమ విశ్వాసపు పనిని కొనసాగించుచున్నట్లైతే, మెల్కీసెదెకు యాజకత్వము గూర్చి వినుటకు వారు మందులుగా ఉండేవారు కాదు. క్రీస్తు యాజకత్వము, మెల్కీసెదెకు యొక్క యాజకత్వ క్రమము చొప్పున ఉన్నందున, క్రీస్తు యాజకత్వమును మనము అధ్యయనం చేయుట ద్వారా, మెల్కీసెదెకు క్రమము యొక్క సాధారణ సూత్రములను మనము అర్థం చేసికొనగలము. బైబిలు రెండు రకములైన యాజక క్రమములను గూర్చి వెల్లడి చేయుచున్నది. లేవి యాజకత్వము మరియు యేసుక్రీస్తు యాజకత్వము అనగా, క్రీస్తు ప్రధాన యాజకుడిగా నియమింపబడిన క్రమము (5:6, 7:11). వారు వెలిగింపబడిన మీదట వారు "బలమైన ఆహారమను" వాక్యమును పొందినప్పుడు యేసుక్రీస్తు యొక్క యాజకత్వమును గూర్చి బోధింపబడిరి (హెబ్రీ. 2:4; 10:32).

ఈ పత్రిక పొందు సమయమునకు వారు, "పాలు త్రాగవలసిన వారుగానే యున్నారు" (హెబ్రీ 5:12). ఆరవ అధ్యాయము మొదటి వచనము ప్రకారము, వారు మూలోపదేశములనే పట్టుకొని వ్రేలాడుచున్నారు. వాస్తవానికి, ఒకడు వారికి తరచుగా మూలపాఠములనే బోధింపవలసివచ్చెను (హెబ్రీ 5:12 6:1,2). ఈ సంఘము (మరి కొన్ని సంఘములై యుండవచ్చును) మరియు చుట్టుప్రక్కలగల సంఘములను 0-10 అను కొలబద్ధలో చూచినప్పుడు, ఆత్మీయముగా వారు అడుగంటియున్నట్టుగా కనబడుచున్నారు. (కొలబద్ధ ప్రకారము ఈ క్రైస్తవులు ఎక్కడ ఉన్నారో తరువాత పాఠములో చూచెదము). "కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా యుండ వలసిన వారై యుండగా" అని రచయిత చెప్పిన దానిని బట్టి వారిప్పుడు ఉన్న స్థితి కంటే, ఉన్నత దశలో ఉండవలసిన వారని, వారిని గూర్చి రచయిత అభిప్రాయము.

మనము ఏమి చేయుచున్నామో జ్ఞాపకముంచుకొనవలెను. ఈ పత్రికను పొందిన వారి మధ్య ఏమి జరుగుచున్నదో అర్థము చేసుకొనుటకై "ఖచ్చితమైన సమస్య"ల పట్టికను మనము తయారు చేయుచున్నాము. వారి సమస్య(లు) ఏమిటో తెలిస్తే, వాటి తీవ్రతయొక్క స్థాయిని గ్రహించగలము. సంపూర్ణ మగుటకు సాగిపోయే క్రైస్తవ జీవితములో వారు ఏ ఆత్మీయ అంశములను గూర్చి వివేచించు స్థాయిలో అప్పటికి ఉండవలసిన వారని రచయిత వారిని గూర్చి అనుకొనుచున్నాడో, దానిని మనము తెలిసికొనవలెను (హెబ్రీ 6:1,2). అందువలన 'సంపూర్ణత' అనగా ఏమిటో మనము తెలిసికొనవలసిన అవసరమున్నది. 6:1,2లో మనము చూచినట్లు అవి, మారుమనస్సు, బాప్తిస్మము మొదలగు అంశములు మాత్రము కాదు. ఈ క్రింది పట్టికలో రచయిత యొక్క 'బలమైన ఆహారపు' అంశములు గలవు:

1. రచయిత ఎవరికి ఈ మాటలు చెప్పుచున్నాడో, వారు చాలా కాలము నుండి సభ్యులుగా ఉన్నవారు, క్రొత్తగా చేరిన సభ్యులుకారు అని మనము ఊహించ వచ్చును. వారు సంఘమందు జరుగు ఉపదేశకుల తరగతిలో ఉండవలసిన వారే కాని క్రొత్తగా క్రైస్తవులైన వారికి జరుగు తరగతిలో కాదు (హెబ్రీ 5:12).
2. వారు చర్చించవలసిన అంశములలో 'దేవుని నీతి' ఒక అంశము అయి ఉండవలెను (హెబ్రీ 5:13).
3. సంపూర్ణులైన మిగతా అందరివలె వారు మంచి, చెడులను ఎరిగినవారే, ఆది. 3:22 మరియు 1 కొరింథి 15:45-49ను చూడుము. ఈ జ్ఞానము మన అంతరంగ పురుషునిలో, మనలో మరియు మనమనస్సులో ఒక భాగము గనుక, నిరంతరము దానికి తర్ఫీదు అవసరము. క్రైస్తవులలో ఎవరైతే నిరంతరము బలమైనఆహారమును భుజించుదురో, వారు అదే సమయములో తమ అనుదిన జీవితములో మేలు కీడులను వివేచించుట నేర్చుకొనెదరు. దేవుని కుమారులుగా ఎదుగుటకు మరియు దేవుని నీతిని అర్థము చేసికొనుటకు మనకు బలమైన ఆహారము అవసరమని ఈ పాఠములో గ్రహించినను, ఇందులో అంతకంటే ఎక్కువ విషయములు కలవు.
4. రాజుగా యేసుక్రీస్తు యొక్క పరిపాలన 1:5-13; 12:22-29ను చూడుము.
5. యేసుక్రీస్తు యొక్క యాజకత్వము (4:14-10:18).

బలమైన ఆత్మీయ ఆహారమును భుజించి వెలిగింపబడిన హెబ్రీ క్రైస్తవులలో జరిగిన ఆత్మీయ పెరుగుదలకు సంబంధించిన పట్టికను ఈ క్రింద చూచెదము (హెబ్రీ 6:4,5).

ఎ. వారు పరలోక సంబంధమైన వరమును రుచిచూచిరి.

బి. వారు పరిశుద్ధాత్మలో పాలివారైరి.

సి. వారు దేవుని దివ్యవాక్యమును రుచి చూచిరి.

డి. వారు రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిరి.

సంఘ సభ్యులందరు ఈ ఆత్మీయ స్థాయికి చేరుకొనకపోవచ్చును, గాని చేరిన వారు పడిపోకుండునట్లు వారికి ఈ పత్రిక వ్రాయబడెను (హెబ్రీ 13:22). ఒకవేళ పడిపోయిన యెడల మారుమనస్సు పొందునట్లు అట్టి వారిని నూతనపరచుట అసాధ్య మని రచయిత చెప్పెను హెబ్రీ 6:4-6ను చూడుము.

ఈ కార్యము సాధించుటలో పత్రిక యొక్క అవసరతను మనము చూడగలము. కొందరు హెబ్రీ క్రైస్తవులు దేవుని కుమారుని బాహాటముగా మరల సిలువ వేయు ప్రమాదకరమైన స్థితిలో

ఉండి ఉండవచ్చును (6:4-6). అయితే, అలాగు చేసే పనిని మానివేయాలనుకొన్న, మారుమనస్సు పొందాలనుకొన్న, వారికి అది సాధ్యము కాకపోవచ్చును. “కొందరు పాపము వలన కలుగు భ్రమచేత కఠినపరచబడి ఉండవచ్చును” (హెబ్రీ 3:13-15). ఆటంకపరచు ప్రతి దానిని మరియు సులువుగా చిక్కులు పెట్టు పాపమును వదలివేయుటకు వారిని ప్రోత్సహించుచు ఈ పత్రిక వ్రాయబడెను (హెబ్రీ 12:1,2). మారుమనస్సు పొందుచు వారు దానిని సాధించి తీరాలి.

“ఆత్మ ఫలము ఫలించుటకును” మరియు వారి ఆత్మీయ ఎదుగుదలకు ఆటంకముగానున్న సమస్యలకును మధ్యగల సంబంధమును రచయిత చూపు చున్నాడు. వ్యవసాయకులకును, తోటమాలిలకును, రచయిత ఇచ్చిన పోలిక యొక్క వివరణ అవసరములేదు. దయచేసి హెబ్రీ 6:7,8ను చదువుము. “మంచిదియును రక్షణకరమైనదియునైన స్థితిలోనే” వారున్నారని రచయిత 9వ వచనములో చెప్పెనని మనము గమనించవలెను. రచయిత వారితో కఠినముగా మాట్లాడు చున్నను వారి విషయములో ఇంకా ఎందుకు నిరీక్షణ కలిగియున్నాడు? సంఘ కుటుంబమును వారు ఇంకా ప్రేమించుచున్నారన్నదే జవాబు. “మీరు పరిశుద్ధులకు ఉపచారము చేసి ఇంకను ఉపచారము చేయుచుండుటచేత తన నామమును బట్టి చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాడు” (హెబ్రీ. 6:10). మన ఆత్మీయ ఎదుగుదలకును మరియు రక్షణకును, మనలను ప్రేమించుచున్న సంఘము ఎంత అవసరమో ఈ పత్రికను చదువుట ద్వారా మనము చూడగలము. అయినప్పటికిని, క్రైస్తవులు న్యాయబద్ధమైన దేవుని కుమారులుగా ఎదుగుటకు ఇది మాత్రము చాలదు (12:8).

వివరమైన పని (exegesis) చేసిన తరువాత **శాస్త్రీయమైన** (hermeneutical) పని చేయుదము. ‘అప్పుడు-అక్కడ’ (exegesis) నుండి ‘ఇప్పుడు-ఇక్కడ’ (hermeneutics)కు మధ్యగల శాస్త్రీయమైన దూరమును తొలగించుటకు మన అధ్యయనములో మనము దేవుని రాజ్యమందున్న జీవపు నియమములను చూచెదము. క్రైస్తవుల ప్రవర్తన యొక్క నీతి సూత్రములు (మనమెలా ప్రవర్తిస్తున్నాము), వేదాంత శాస్త్రము (దేవుని గూర్చి, మానవజాతి కొరకు ఆయన కృపలు మరియు పథకములను గూర్చి మనము ఏమి తెలిసికొనగలము) మరియు నియమింపబడిన అభ్యాసములు (బాప్తిస్మము, ఆరాధన క్రమము, సువార్త ప్రకటన), వీటన్నిటి మధ్యగల దూరమును తొలగించుటకు ఇవి బదిలి చేయబడవలెను. వారి చారిత్రాత్మక వృత్తాంతములు మరియు సమస్యల సామానులను మనము వెనుకకు వదలి వేయుదము. హెబ్రీ పత్రికను గూర్చి మన ప్రశ్నఏమంటే, ఈ సమాచారము ఈ రోజునకు ఏ అర్థమును ఇస్తున్నది? ఇది శాస్త్రీయమైన ప్రశ్న.

అనేక సూత్రములు ఈ పత్రికలో తేటగా చిత్రించబడినవి. ఉదాహరణకు: “వినుటకు మందులు”గా ఉండే అవకాశం క్రైస్తవులకు ఇవ్వబడలేదు. దేవుని వాక్యమును అధ్యయనము చేయుట ద్వారా మన ఆత్మీయ స్థాయిని పెంచుకొనుటకు మనము ఎప్పుడూ అపేక్షించుదము. మనము చేయు అధ్యయనములో మంచి బైబిలు వ్యాఖ్యాన సూత్రములను ఉపయోగించుట ద్వారా అది సాధ్యమగును. కావున, దేవుని వాక్యము ఎలాగు వ్రాయబడెనో, అలాగే దానిని విందుము (వినుట, ఆలోచించుట మరియు గ్రహింపుతో నేర్చుకొనుట). తరువాత మన మనస్సులతో నేర్చుకొనిన దానిని మన హృదయములయందలి విశ్వాసముతో కలుపుకొనగలము (ఉద్వేగముతో నేర్చుకొనుట) (హెబ్రీ 4:2). అయినను, విశ్వాసము ఉండుట లేదా లేకపోవుట అనునది మన ప్రవర్తనయందు మరియు అలవాట్లయందు కనబడును మత్తయి. 5:13-16; 7:24 చూడుము.

మన తరువాత పాఠములో, మనము సిద్ధపరిచిన ఖచ్చితమైన సమస్యల పట్టికలో గ్రహీతలకు సంబంధించిన మరికొన్ని సమస్యలను చేర్చుదము. దయచేసి హెబ్రీ 10:32-39 మరియు 12:4-13ను చదువుము.